# బీసీలపై బీజేపీ కపట ప్రేమ

- బీఆర్‌ఎస్‌పై బురద చల్లే ప్రయత్నంలో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు
- ఎమ్మెల్యే అభ్యర్థి జోగు రామన్న

ఆదిలాబాద్ రూరల్, నవంబర్ 21 : బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పొందిన ప్రతిపక్ష పార్టీల నాయకులు సైతం ఎన్నికల వేళ విమర్శలు చేస్తున్నారని, టికెట్లు అమ్ముకున్న కాంగ్రెస్ పార్టీ, ప్రజా సంక్షేమాన్ని విస్మరించిన బీజేపీలకు ప్రజాక్షేత్రంలో తగిన గుణపాఠం చెప్పాలని ఎమ్మెల్యే అభ్యర్థి జోగు రామన్న పిలుపునిచ్చారు. ఆదిలాబాద్ రూరల్ మండలంలో చాంద(టీ), భీంసరి, అర్లి గ్రామాల్లో ఎమ్మెల్యే అభ్యర్థి జోగు రామన్న ప్రచారం నిర్వహించారు. గ్రామాల్లో ఆయనకు ప్రజలు ఘన స్వాగతం పలికి గజమాలతో సత్కరించి అభిమానాన్ని చాటుకున్నారు. ఆయా గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూ జోగు రామన్నకే తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. పార్టీ నాయకులు ప్రమోద్ భానుకర్ ఆధ్వర్యంలో మంగ్లీ, భీంసరి గ్రామాలకు చెందిన బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నాయకులు, యువకులు పెద్ద ఎత్తున బీఆర్ఎస్‌లో చేరగా వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో బీజేపీ బీసీ అభ్యర్థిని సీఎం చేస్తామంటూ బూటకపు హామీలు ఇస్తోందని మండిపడ్డారు. కేంద్ర బడ్జెట్‌లో బీసీల సంక్షేమం కోసం రెండు వేల కోట్లను మాత్రమే కేటాయించిన బీజేపీ బీసీల గురించి మాట్లాడడం హాస్యాస్పదమని అన్నారు. బండి సంజయ్‌ను రాష్ట్ర అధ్యక్ష పదవి నుంచి తొలగించడం ఆ పార్టీకి బీసీలపై ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమని, ఆదిలాబాద్‌లో ఆయన బీసీల గురించి మాట్లాడడం విడ్డూరమని అన్నారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీ నేతల వ్యవహార శైలిపై ధ్వజమెత్తిన జోగు రామన్న వారితోపాటు వారి కుటుంబ సభ్యులకు సైతం సంక్షేమ పథకాల ఫలాలు అందిన విషయాన్ని గుర్తు చేశారు. నోట్ల సంచులతో టికెట్టు కొనుక్కున్న కాంగ్రెస్ అభ్యర్థి ఓడిపోయిన వెంటనే తన దారిని తాను చూసుకుంటాడని ఎద్దేవా చేశారు. నియోజకవర్గ పరిధిలో రూ.12 కోట్ల నిధులతో ఆలయాల అభివృద్ధి, నిర్మాణాలు చేపట్టామని తెలిపారు. బీజేపీ అభ్యర్థి భూ కబ్జాల గురించి, ఆయన చరిత్ర గురించి ప్రతి ఒక్కరికి తెలుసని పేర్కొన్నారు. అభివృద్ధి, సంక్షేమమే ప్రధాన అజెండాగా ముందుకు సాగుతున్న కారు గుర్తుకు ఓటు వేసి తనను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఆదిలాబాద్‌రూరల్ : చాంద(టీ) గ్రామంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి జోగు రామన్న

### మరోసారి అవకాశం కల్పించండి

ఎదులాపురం, నవంబర్ 21 : ఆదిలాబాద్ నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి ,సంక్షేమ పథకాలను చూసి మరోసారి అవకాశం కల్పించాలని ఎమ్మెల్యే అభ్యర్థి జోగు రామన్న కోరారు. ప్రచారంలో భాగంగాలో మంగళవారం పట్టణంలో ప్రధాన మార్కెట్, బట్టలషాపులు, కిరణాషాపు, జనరల్ స్టోర్లు, పూలు, పండ్ల షాపులలో, కూరగాయల మార్కెట్‌లో కరపత్రాలు ఇచ్చి కారు గుర్తుకే ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ప్రచారంలో దుకాణాదారులు జోగు రామన్నకు సాధరంగా స్వాగతం పలికారు. బీఆర్ఎస్ మహిళా విభాగం పట్టణ అధ్యక్షురాలు స్వరూపరాణి, వార్డు కౌన్సిలర్ ప్రకాశ్, బీఆర్ఎస్ నాయకులు కరుణా,లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

### బీఆర్ఎస్‌కు మద్దతు ఇవ్వండి...

ఎదులాపురం, నవంబర్ 21 : ఆదిలాబాద్‌లో జరగనున్న ఎన్నికల్లో తమకు మద్దతు ఇవ్వాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జోగు రామన్న సీపీఎంను కోరారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సీపీఎం పార్టీ కార్యాలయంలో సీనియర్ నేతలతో కలిసి సమవేశమయ్యారు. ప్రసుత్త రాజకీయ పరిణామాలపై ఇరువురు సుదీర్ఘంగా చర్చించారు. తమకు పార్టీ పరంగా మద్దతు ఇవ్వాలని ఎమ్మెల్యే అభ్యర్థి జోగు రామన్న కోరాగా జిల్లా కమిటీ సమావేశంలో చర్చించి తదుపరి నిర్ణయం వెల్లడిస్తామని పార్టీ జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేశ్ అన్నారు. సమావేశంలో సీపీఎం పార్టీ సీనియర్ నాయకులు లంక రాఘవులు, బండి దత్తాత్రి, అన్నమొల్ల కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధిని చూసి ఓటెయ్యండి



ఆదిలాబాద్‌రూరల్ : బీఆర్ఎస్ మ్యానిఫెస్టో గురించి వివరిస్తున్న మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్

ఆదిలాబాద్ రూరల్/ఎదులాపురం, నవంబర్ 21 : బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధి చూసి ఓటెయ్యాలని మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ ప్రజలకు సూచించారు. మంగళవారం పట్టణంలోని రాంనగర్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ కారు గుర్తుకే ఓటు వేసి ఎమ్మెల్యే అభ్యర్థి జోగు రామన్నను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. బీఆర్ఎస్ గీతాలకు అనుగుణంగా కార్యకర్తలతో కలిసి నృత్యాలు చేస్తూ వారిని ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా జోగు ప్రేమేందర్ మాట్లాడుతూ పట్టణంలో అభివృద్ధి జరగలేదంటూ ప్రతిపక్ష నేతలు విమర్శలు చేయడం హాస్యాస్పదంగా ఉందని అన్నారు. ఇటీవల బండి సంజయ్ పర్యటించిన సమయంలో చేసిన విమర్శలను తిప్పికొట్టిన ఆయన వారసత్వ రాజకీయాల గురించి బీజేపీ నేతలు మాట్లాడడం విడ్డూరమని పేర్కొన్నారు. బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి కుమారుడు సర్పంచ్‌గా ఎన్నికైన విషయాన్ని గుర్తు చేశారు. మత విద్వేషాలు రెచ్చగొడుతూ ప్రజల మధ్య చిచ్చు పెట్టేందుకు బీజేపీ చేస్తున్న యత్నాలను తిప్పికొట్టాలని సూచించారు. అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్న కారు గుర్తుకే ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు సుజాత– భూమన్న, పవన్ నాయక్, వార్డు ఇన్‌చార్జి విజ్జగిరి నారాయణ, జాగృతి జిల్లా అధ్యక్షుడు రంగినేని శ్రీనివాస్, నాయకులు దయాకర్, మహకల్ అజయ్, కలీం, మునిర్, రమేశ్, మర్రి విజయ, గీత, తదితరులు ఉన్నారు.

## రణదీవేనగర్‌లో జోగు రామన్న సతీమణి ప్రచారం



ఎదులాపురం : ప్రచారం చేస్తున్న జోగు రామన్న సతీమణి జోగు రామ

ఎదులాపురం, నవంబర్ 21 : పట్టణంలో రణదీవేనగర్‌లో ఎమ్మెల్యే అభ్యర్థి జోగు రామన్న సతీమణి జోగు రామ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ కారు గుర్తుకు ఓటు వేయాలని విజ్ఞాప్తి చేశారు. మహిళలకు బొట్టు పెడుతూ ఓట్లను అభ్యర్థించారు. కాలనీవాసులను ఆపాయంగా పలకరించి యోగాక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. కారు గుర్తుకే తమ ఓటని ప్రజలు ఆదరించడంపై హర్షం వ్యక్తం చేశారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతున్న బీఆర్ఎస్‌కే సంపూర్ణ మద్దతు లభిస్తోందన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ కోవ రవి, మహిళా విభాగం పట్టణ ప్రధాన కార్యదర్శి బొడగం మమత, నాయకులు ప్రభావతి, నల్ల మహేందర్, రేఖ, గోవర్ధన్ యాదవ్, జహుర్‌ఉద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

## గూడలో..



జైనథ్ : గూడలో ఇంటింటికీ తిరుగుతూ ఓటు అభ్యర్థిస్తున్న ఎంపీపీ గోవర్ధన్

జైనథ్, నవంబర్ 21: మండలంలోని గూడ గ్రామంలో బీఆర్ఎస్ శ్రేణులు ఇంటింటి ప్రచారం చేపట్టారు. బీఆర్ఎస్ మ్యానిఫెస్టో కర పత్రాలు పంచుతూ ఓటును అభ్యర్థించారు. కార్యక్రమంలో ఎంపీపీ మార్సెట్టి గోవర్ధన్, సర్పంచ్‌ల సంఘం మండలాధ్యక్షుడు ఊశన్న, పీఏసీఎస్ చైర్మన్ పురుషోత్తం, సర్పంచ్‌లు ప్రభాకర్, ఉమేశ్, విఠల్ రెడ్డి, వెంకన్న, కేశవ్, సునీల్, బాలాజీ, పరమేశ్వర్, ఎంపీటీసీలు భోజన్న, రమేశ్ పాల్గొన్నారు.

## 23 ఉచిత కంటి వైద్య శిబిరం

ఎదులాపురం, నవంబర్ 21 : రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ కార్యాలయంలో గురువారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు అసోసియేషన్ జిల్లా అధ్యక్షకార్యదర్శులు లక్ష్మారెడ్డి, పడగంటి కిష్టయ్య తెలిపారు. వరంగల్‌కు చెందిన శరత్ మాక్సి విజన్ కంటి దవాఖాన వైద్యులు పరీక్షలు చేస్తారని పేర్కొన్నారు.

## బీఆర్ఎస్‌తోనే సంక్షేమ పథకాలు



నార్నూర్: ప్రచారం చేస్తున్న అన్నాభావుసాఠే మనుమడు సచిన్‌భావు సాఠే

నార్నూర్, నవంబర్ 21 : బీఆర్ఎస్ ప్రభుత్వం వస్తేనే సంక్షేమ పథకాల అమలు సాధ్యమని బీఆర్ఎస్ నాయకుడు జాదవ్ ప్రకాశ్ ప్రజలను కోరారు. మంగళవారం మండలంలోని బలాన్‌పూర్, నాగల్‌కొండ, మరపగూడ, సోనాపూర్ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ బీఆర్ఎస్ మ్యానిఫెస్టోను వివరించారు. కారు గుర్తుకు ఓటేసి ఆసిఫాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కోవ లక్ష్మిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు జాదవ్ ఉత్తమ్, మాహదవ్ కేంద్రే, పరమేశ్వర్, రాహుల్, రవీందర్, అంబరావు, కిరణ్, జితేందర్, యూసుఫ్‌పటేల్, మారుతి పటేల్, రాము పాల్గొన్నారు.

### కోవ లక్ష్మిని గెలిపిస్తే..

### సీఎంతో చర్చించే అవకాశం

నార్నూర్, నవంబర్ 21 : ఆసిఫాబాద్ నియోజక వర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కోవ లక్ష్మిని భారీ మెజార్టీతో గెలిపిస్తే గిరిజనేతరుల సమస్యలపై సీఎం కేసీఆర్‌తో చర్చించే అవకాశముంటుందని సాహిత్య సామ్రాట్ డాక్టర్ అన్నాభావుసాఠే మనుమడు, మహారాష్ట్ర బీఆర్ఎస్ నాయకుడు సచిన్‌భావుసాఠే అన్నారు. మండల కేంద్రంలోని ఆదర్శనగర్‌లో సోమవారం రాత్రి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏజెన్సీ చట్టాలతో గిరిజనేతరులు ఎదుర్కొంటున్న సమస్యలు స్వయంగా తెలుసుకున్నారు. మాతంగ్ సమాజ్ ఐక్యమత్యంతో బీఆర్ఎస్‌కే ఓటు వేయాలని కోవలక్ష్మికి మెజార్టీ ఇవ్వాలన్నారు. అప్పుడే సమస్యను సీఎంతో చర్చించే అవకాశం ఉంటుందన్నారు. కాంగ్రెస్, బీజేపీలకు ఓటు వేయడంతో పేదలపై దొరల పాలన అవలంబిస్తారన్నారు. ఆలోచించి ఓటు వేయాలని మాతంగ్ సమాజ్‌ను కోరారు. కార్యక్రమంలో అన్నాభావుసాఠే సంఘం జిల్లా అధ్యక్షుడు ఉదయ్‌కాంబ్లే, మాజీ జడ్పీటీసీ రూపావతిజ్ఞానో బాపుష్కర్, మండల ప్రధాన కార్యదర్శి సయ్యద్‌ఖాసీం, నాయకులు షేక్ దాదే అలీ, మసూద్, ,శాంతారావ్ పాల్గొన్నారు.

## హోం ఓటింగ్ టీం ద్వారా పోస్టల్ బ్యాలెట్ ఓట్లు



పోస్టల్ బ్యాలెట్ మొదటి ఓటును వినియోగించుకుంటున్న కందుకూరి వెంకటమ్మ

ఎదులాపురం, నవంబర్ 21 : ఎన్నికల కమిషన్ ఈ సారి 80 ఏళ్లు దాటిన వయోవృద్ధులు, దివ్యాంగులకు ఇంటి వద్దే తమ ఓటు హక్కు వినియోగించుకునే వెసులుబాటు కల్పించింది. అందులో భాగంగా ఆదిలాబాద్‌లో మంగళవారం హోం ఓటింగ్ టీం పోస్టల్ బ్యాలెట్ ఓట్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారి ఇళ్లకు వెళ్లింది. ప్రిసైడింగ్ అధికారి కిషన్‌సింగ్, ఏపీవో మూగ శ్రీనివాస్ , మైక్రో ఆబ్జర్వర్ అజయ్, బీఎల్వో లక్ష్మి, కానిస్టేబుల్ రమేశ్, వీడియోగ్రాఫర్లు పట్టణంలోని రిమ్స్ సూపరింటెండెంట్ డాక్టర్ అశోక్ తల్లి కందుకూరి వెంకటమ్మ(85) వద్దకు వచ్చి పూర్తిగా అవగాహన కల్పించారు. తర్వాత ఆమె ఓటుహక్కు కోడలు డాక్టర్ రమ సహాయంతో వినియోగించుకున్నది. కాగా ఆదిలాబాద్ జిల్లాకు సంబంధించి ఈమెది హోం ఓటింగ్ టీం ద్వారా మొదటి ఓటు . ఈమె పోలింగ్ బూత్ 267. కాగా హో ఓటింగ్ కోసం ఈటీం పరిధిలో 27 మంది దరఖాస్తు చేసుకోగా మంగళవారం 13 మంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా వయోవృద్ధులు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. మురార్కర్ విశ్వాంబర్ (82) పోలింగ్ బూతు నంబర్ 268 పరిధిలో తన ఓటు హక్కు వినియోగించుకున్నాడు. ఈ వయోవృద్ధుడికి కంటి చూపు ఆనక, చెవులు తక్కువగా వినబడడంతో తన కుమారుని సహాయంతో ఓటుహక్కు వినియోగించుకున్నాడు. ఈ ప్రక్రియను మొత్తంగా వీడియో చిత్రీకరణతో పూర్తి చేశారు.